www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 17 సెప్టెంబర్ 2025 5 కాకినాడ

ఎస్సిలకు అండగా వైసిపి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

దళితులకు అండగా వైసిపి కట్టుబడి ఉందని వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మంగళవారం శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన దళిత సంఘం నాయకులు కిర్లంపూడిలో గిరిబాబును కలిశారు. కత్తిపూడిలో త్వరలో నిర్వహించే దళిత ప్రజా సమితి వార్షికోత్సవానికి రావాలని గిరిబాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు వైసిపి పాలనలో పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సమితి నాయకులు అపురూప్, తాతాజీ, శివ, రాఘవ, సుబ్బారాజు పాల్గొన్నారు.



గిరిబాబుతో సమితి నాయకులు

కష్టం బారెడు... జీతం మూరెడు

- అరకొర వేతనమే దిక్కు
- మూడు నెలలుగా పెండింగ్
- దుర్భర జీవితాలను అనుభవిస్తున్న వైనం
- పాఠశాల పారిశుధ్య కార్మికుల వెతలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగాన్ని సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన విద్యా విధానాలను ప్రవేశపెట్టి పలువురు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తోందనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గత, ప్రస్తుత ప్రభుత్వాలు పాఠశాలల విలీనం పేరుతో విద్యా వ్యవస్థను భ్రష్ట పట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పాఠశాలల పారిశుధ్య కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నాయి. తల్లికి వందనం రూ.15 వేలు ఇస్తున్నామని చెప్పి అందులో రూ.2 వేలు కోత విధిస్తున్నారు. పాఠశాలల నిర్వహణ పేరుతో ఈ సొమ్మును మినహాయిస్తున్నప్పటికీ అందుకోసం ఖర్చు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. దీనిలోభాగమే పారిశుధ్య కార్మికులకు అరకొర వేతనాలను మాత్రమే అందిస్తుంది. పాఠశాలలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న వారి సమస్యలను పాలకులు గాలికొదిలేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,110 ప్రాథమిక, 214 ప్రాథమికోన్నత, 200 ఉన్నత పాఠశాలల్లో సుమారు 4,200 మంది పని చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి ప్రకారం పారిశుధ్య కార్మికులను నియమించారు. 300 మందికి లోపు విద్యార్థులు ఉంటే ఒక ఆయాను, 301 నుంచి 600 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు, 601 నుంచి 900 మందికి ముగ్గురు, 900 పైగా విద్యార్థులు ఉంటే నలుగురిని నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏడాది పాఠశాలలు తెరిచే ముందే తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ఆయాలను నియమించుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్యం నిర్వహించే వారికి గతంలో నెలకు రూ.2 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకైతే రూ.2,500, ఉన్నత పాఠశాలలో పనిచేసేవారికి వారికి రూ.4 వేలు గౌరవ వేతనంగా నిర్ణయించి అందించేవారు. గత విద్యా సంవత్సరం నుంచి అందరికీ రూ.6 వేలు ఇస్తున్నారు.

పాఠశాలల్లో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కుటుంబ పోషణ ఎలా..?

ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు నియమించిన ఆయాలకు అరకొర వేతనాలను మాత్రమే ఇస్తున్నారు. రూ. 6 వేలతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యవసరాల ధరలు పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వం తమకు కనీస వేతనాలను అమలు చేయాలంటూ కోరుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరం పాఠశాలలను అంటూ పెట్టుకుని పారిశుధ్య సేవలు వీరు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతో కనీస వేతనాలకు నోచుకోవడం లేదు. అవి కూడా మూడు నెలలుగా పెండింగ్లో ఉన్నాయి.

తగినన్ని నిధులున్నా...

ఒక్కొక్క ఆయాకు నెలకు రూ.6 వేల ప్రకారం ఏడాదికి 10 నెలలు గౌరవ వేతనం ఇస్తున్నారు. తల్లికి వందనంలో కోత విధిస్తున్న ప్రభుత్వం ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు వరకూ పక్కన ఉంచుతుంది. కానీ ఇప్పటికీ ఈ నిధుల నుంచి ఆయాలకు వేతనం చెల్లించడం లేదు. తగినన్ని నిధులు ఉన్నా, జిల్లా విద్యాశాఖ అధికారులు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కావున ప్రభుత్వం కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్లు ఆయాల నుంచి వినిపిస్తున్నాయి.

కనీస వేతనాలు ఏవీ?

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేదుకు ఏళ్లుగా పని చేస్తున్నాను. ఇచ్చే అరకొర వేతనాలు ఎప్పుడూ పెండింగ్లోనే ఉంటున్నాయి. కనీస వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- ఎన్.సునీత, ఎంపిపి పాఠశాల, కొండెవరం, యు.కొత్తపల్లి మండలం

కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి

గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇచ్చే అరకొర వేతనాలు సరిపోవడం లేదు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. గ్లౌజులు, యాప్రాన్ మాత్రమే ఇస్తున్నారు. బూట్లు ఇతర రక్షణ పరికరాలు ఇవ్వడం లేదు. కళ్ళు మండిపోతున్నాయి.

-గండేపల్లి సత్యవతి, పాఠశాల పారిశుధ్య కార్మికురాలు, పిఠాపురం

కనీస వేతనం ఇవ్వాలి

నిరంతరం పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న కార్మికులకు జిఒ 07 ప్రకారం కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి. చదరపు గజాలను బట్టి పాఠశాలలకు వర్కర్లను నియమించాలి. స్కూల్ అభివృద్ధి కమిటీ పలు చోట్ల ఇష్టానుసారంగా మారుస్తున్నారు. పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి.

-చంద్రమళ్ళ పద్మ, సిఐటియు నాయకురాలు

నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ఎన్నికలు నిర్వహించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థకు తక్షణమే ఎన్నికల నిర్వహించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జోరు వానలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ నగరంలో ప్రత్యేక అధికారి పాలనకు నేటితో 3 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. 2005లో మున్సిపాలిటీ నుంచి నగర పాలక సంస్థగా అభివృద్ధి చెందిందని, ఈ 20 ఏళ్ల కాలంలో కేవలం 10 సంవత్సరాలు మాత్రమే పాలకవర్గం కొలువు తీరిందన్నారు. గతంలో ఏడు సంవత్సరాలుగా ఎన్నికలు లేకుండా ప్రత్యేక అధికారి పాలన సాగిందని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులతో 2017లో ఎన్నికలు జరిగాయన్నారు. గత మూడేళ్లుగా పాలకవర్గం లేక కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. 74వ రాజ్యాంగ సవరణ నగరంలో అమలు కావడం లేదన్నారు. ప్రజా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదన్నారు. చిన్నపాటి వర్షానికే నగరంలో ప్రధాన వీధులు జలమయం అవుతున్న పరిస్థితి ఉందన్నారు. స్మార్ట్ సిటీ నిధులతో కొంత అభివృద్ధి జరిగినా అనేక విషయాల్లో నగరంలో అభివృద్ధి ముందుకు సాగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించి ప్రజా పాలన కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యుడు మలకా వెంకటరమణ, నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, సిహెచ్.విజయ్‌కుమార్, ఆర్. రమేష్, జె.శేషు, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ్‌లో టెక్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సాధన 2కె25 పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె మాజీ ఇన్‌ఛార్జ్ విసి, ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాక్ తాన్ ప్రోగ్రాంతో విద్యార్థులు కోడింగ్ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆధునిక సమాజంలో ఉన్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చెడు స్నేహాల జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరి జీవితంలో పోటీతత్వం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్, బిటెక్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఎన్.రాజశేఖర్, డీన్ ఎస్.కొండలరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు టి.ప్రేమ్ బాస్కో, ఎం.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదర్శ్ నిర్వాహకులు

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కరప

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వళ్ల రాజబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక భవన నిర్మాణ కార్మికులు భవనంలో ఎడ్ల కృష్ణ అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ అధికారులు ఈ క్రాప్ చేయించాలన్నారు. కౌలు రైతులు పంట అమ్ముకోవడానికి హక్కు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కౌలు చట్టం ఉనికిలో లేదని, రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని ఇప్పటికే పలు దఫాలుగా ప్రభుత్వానికి వినతులు ఇచ్చామని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు రాంప్రసాద్ మాట్లాడారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికే మండల మహాసభ జరపాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రైతులు రెడ్డి వీరభద్రరావు, పెంకే ధనరాజు, బి. వీరవెంకటసత్యనారాయణ, చందాల శ్రీను, ఎం.సత్యనారాయణ, వి. గంగారాం, ఎం. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం కార్యదర్శి రాజబాబు

కాలపరిమితి జిఒ రద్దు కోసం విఒఎల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

యానిమేటర్ల మూడేళ్ల కాలపరిమితి జిఒను రద్దు చేయాలంటూ యానిమేటర్లు ధర్నా నిర్వహించారు. ఎపి విఒఎ యనిమేటర్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో యానిమేటర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాభవాని, ఈశ్వరిభాయి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడారు. శాంతియుత ఆందోళన చేస్తున్న విఒఎలను పీడీ కార్యాలయం లోనికి రానీయకుండా గేట్లు తాళాలు వేసి తోటి ఉద్యోగులను అవమానించడం దారుణమన్నారు. వర్షంలో సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న మహిళా ఉద్యోగులు పట్ల నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తక్షణం విఒఎలను శత్రువులుగా చూడడం మాని, తోటి ఉద్యోగులుగా గుర్తించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు విఒఎల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి నేడు పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. మెప్మాలో కాలపరిమితి రద్దు చేసినట్టు యానిమేటర్ల కాల పరిమితిని రద్దు చేసేంతవరకు పోరాడుతామని అన్నారు. స్త్రీశక్తి బకాయిలు యానిమేటర్ల వేతనాల నుంచి రికవరీ చేయడం మానుకోవాలన్నారు. ఇచ్చే రూ.10 వేల వేతనం నెలల తరబడి బకాయి పెడితే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. యానిమేటర్లతో కోళ్ళు, పాల అమ్మకాలు, గేదెల కొనుగోలు వంటి అదనపు పనులు చేయించడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం పట్ల పీడీ స్పందన నిరాశజనకంగా ఉందని, ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే రోజువారి ఆందోళనలకు యానిమేటర్లు సిద్ధపడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్నబుల్లి, మేరీ, సుశీల, ఈశ్వరి, దేవి, రత్నమాల, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ కార్యాలయ వద్ద ధర్నా చేస్తున్న విఒఎలు

బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బుద్ధరాజు లక్ష్మణరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అల్లవరం మండల పరిషత్ ఎఒగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావు ఉద్యోగోన్నతిపై తాళ్లరేవు ఎంపిడిఒగా బదిలీపై వచ్చారు. ఎంపిపి రాయుడు సునీతను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఆయనకు మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

'64 గ్రామాలను విలీనం చేయాలి'

ప్రజాశక్తి - కాకినాడ

నగర పాలక సంస్థ పరిసర ప్రాంతాలకు చెందిన 64 గ్రామాలను కాకినాడలో విలీనం చేయాలని మాజీ కౌన్సిలర్ దూసర్లపూడి రమణరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడేళ్లుగా కార్పొరేషన్ ఎన్నికలు లేకుండా స్పెషల్ ఆఫీసర్ పాలనలో బంధించడం తగదన్నారు. 15 ఏళ్లుగా తూరంగిచ, ఇంద్రపాలెం, చీడిగ, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, గంగనాపల్లికి చెందిన టీచర్స్ కాలనీ ప్రాంతాలను విలీనం చేసిన చర్యలను చట్టబద్దం చేయకపోవడంతో ఎన్నికలు జరగడం లేదన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వలన ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదన్నారు. కాకినాడ నగరంలో సమీప 64 గ్రామాలను విలీనం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి'

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హైస్కూల్లో ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీ ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన హ్యాండ్ బాల్ కోర్టును ఎంపి హరీష్‌మాధుర్, వాలీబాల్ కోర్టును ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. తొలుత హైస్కూల్లో పిఎం శ్రీ పథకంలో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, లైబ్రరీ హాల్, కిచెన్ గార్డెన్, రైన్ హార్వెస్టింగ్, అదనపు తరగతి గదులను ఎంపి, ఎంఎల్ఎలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులతో పాఠశాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని, పాఠ శాల పై అంతస్తులో మీటింగ్ హాల్ నిర్మించాలని ఎంపికి హైస్కూల్ హెచ్ఎం వి.ప్రసాదరావు, ఎస్ఎంసి ఛైర్మన్ పి.శ్రీమన్నారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, వ్యాయామ ఉపాధ్యా యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపి, ఎంఎల్ఎలు

వినూత్నంగా ఆలోచిస్తేనే మనుగడ

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులు వినూత్నంగా ఆలోచిస్తేనే భవిష్యత్‌లో మనుగడ ఉంటుందని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 'వేద 2కె25' జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ ముగిసింది. ఈ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మేధకు పదునుపెట్టి తయారు చేసిన పలు ప్రాజెక్టులు సృజనాత్మక భావాలకు నూతన ఆలోచనలకు అద్దంపట్టాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఆవిష్కరణలను, విశేషాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రో ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రవితంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వేద - 2కె25 కో ఆర్డినేటర్ డాక్టర్ డి.కిషోర్, వివిధ విభాగాల డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

డిఎస్‌సిలో పారా క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - కాకినాడ

క్రీడా పాలసీ-2024లో పారా (వికలాంగ) క్రీడాకారులు డిఎస్‌సిలో ఉత్తమ ప్రతిభను చాటుకోవడం ఆనందకరంగా ఉందని ఎపి పారా స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. డిఎస్‌సిలో 14 మంది క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను చాటుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. వీరికి సమాన గౌరవం కల్పించి, ఉద్యోగ అవకాశాలలో 3 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇది కేవలం ఉద్యోగ విజయమే కాదని, వికలాంగ క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు అని ఆయన అభివర్ణించారు.

నేటి నుంచి ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు, కాజులూరు

స్వస్థనారి సశక్ పరి వార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేబ్రోలు పిహెచ్‌సి ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యులు సాయిరతన్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. చేబ్రోలు సచివాలయం-2 వద్ద ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి వచ్చే నెల రెండో తేదీ వరకూ చందుర్తి, చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో చిన్న పిల్లల వైద్యులు హాజరై పిల్లల ఆరోగ్య పరీక్షలు, మహిళలకు రక్తపోటు, చక్కెర, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్కానింగ్ చేస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే కాజులూరు మండలంలోని గొల్లపాలెం, దుగ్గుదుర్రు పిహెచ్‌సిలు, అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద బుధవారం నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయా పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ సుప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉప్పుమిల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్టూ'నిజం'

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం జరిగింది. ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు మాట్లాడుతూ ఓజోన్ పొరను సంరక్షించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ క్విజ్‌లో 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బాలరాజు, రసాయన శాస్త్ర అధ్యాపకుడు మల్లికార్జునశర్మ, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ పివివి. సత్యనారాయణ, ఫిజిక్స్ అధ్యాపకుడు గోపాలకృష్ణ, ఆకడెమిక్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వర్, ఝాన్సీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు. **కాకినాడ** ఆదిత్య కళాశాలలో కాకినాడ ఐడిఎ, ఆదిత్య ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ చిన్న చర్యలు పెద్ద మార్పులకు దారితీస్తాయని అన్నారు. ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఐడిఎ వైద్య బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐడిఎ సభ్యులు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ సాయికార్తీక్, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక అయోధ్యరామపురం పిఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఓజోన్ పొర ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ అడ్డాల

సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి

అధికారుల సూచనలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

వ్యవసాయాధికారుల సూచనలు పాటించడం ద్వారా అధిక పంట దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి అన్నారు. మంగళవారం మండలంలోని రాయ భూపాలపట్నంలో మండల ఉద్యాన అధికారి కె.సత్యశైలజ అధ్యక్షతన కర్ర పెండలం దుంప సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వినియోగించాలన్నారు. దీనివల్ల చీడ, పీడల నివారణ సాధ్యమవుతుందని అన్నారు. నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మన్యం ప్రసన్నకుమార్, కల్లూరి శ్రీనివాస్, నల్లల శ్రీను, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

30న ఎపిఎన్‌జిఒ తాలూకా యూనిట్ ఎన్నికలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎపిఎన్‌జిఒ తాలూకా యూనిట్ ఎన్నికలు ఈ నెల 30వ తేదీన జరుగుతాయని జిల్లా సహాధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్థానిక శ్రీ భీమేశ్వర లైన్స్ క్లబ్ భవనంలో ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారిగా కరప యూనిట్ అధ్యక్షులు బిఆర్‌వి.చౌదరి, సహాయ ఎన్నికల అధికారిగా కరప యూనిట్ కార్యదర్శి కె.కేశవరావు, పర్యవేక్షణ అధికారిగా జిల్లా ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబులను నియమించినట్లు చెప్పారు.

డివిజన్‌లో 137.8 మిల్లీమీటర్ల వర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో మంగళవారం 137.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావు తెలిపారు. మండలాల వారీగా తునిలో 2.6, రౌతులపూడిలో 1.4, శంఖవరంలో 3.8, ఏలేశ్వరంలో 10.2, జగ్గంపేటలో 36.2, కిర్లంపూడిలో 6.2, ప్రత్తిపాడులో 11.6, తొండంగిలో 10.8, పెద్దాపురంలో 24.2, గండేపల్లిలో 30.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందని ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరంలో విద్యుదాఘాతంతో ఒక యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం అన్నవరం గ్రామ శివారులో నూతనంగా వేసిన లేఅవుట్ స్థలాల్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా బర్ల సోమరాజు విద్యుధాఘాతానికి గురియై మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం తాండవపల్లి పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి పంట కాలువలో సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయసు గల గుర్తు తెలియని పురుషుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న అమలాపురం తాలూకా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తాలూకా పోలీస్ స్టేషన్లో ఈ నం. 9440796562, 9440796525లను సంప్రదించాలన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పి దేవకుమార్

బైకుల చోరీ ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - పెరవలి

అంతర్ జిల్లా బైకుల చోరీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కొవ్వూరు డిఎస్పి జి.దేవకుమార్ ఈ వివరాలను వెల్లడించారు. రాజమహేంద్రవరం, అనపర్తి, విశాఖపట్నం, అమలాపురం పెనుగొండ, పెనుమంత్ర తదితర ప్రాంతాల్లో బైకుచోరీలు ఎక్కువ కావడంతో నిఘా పెట్టామన్నారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది, కొవ్వూరుకు చెందిన ఇద్దరు కానిస్టేబుల్స్ బృందంగా ఏర్పడి పెరవలి సెంటర్‌లో తనిఖీలు చేపట్టారన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన రికార్డులు లేనివారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఆరా తీయగా దొంగల ముఠాగా గుర్తించారని తెలిపారు. పెరవలి మండలం ఖండవల్లికి చెందిన తుమ్మగంటి ధనుష్, నెక్కంటి యువరాజు, విశ్వనాధుల దేవిశ్రీప్రసాద్, రాజఒమ్మంగి గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి పాపారావు బృందంగా ఏర్పడి బైకులు చోరీ చేస్తున్నారని తెలిపారు. వీరి నుంచి రూ.20లక్షల విలువైన 26 బైకులను రికవరీ చేశామని తెలిపారు. ఇంటి వద్ద తాళాలు వేసి ఉన్న మోటర్ బైకులను వీరు చాకచక్యంగా చోరీ చేస్తారన్నారు. సిఐ తిలక్ సహకారంతో ఈ ముఠాను పట్టుకున్న ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ ఎస్ఐ కె.సౌజన్య, కానిస్టేబుల్స్ కె.శ్రీహరి, కె.నరేంద్ర, ఎం.ముత్యాలు, ఎస్.గంగాధరరావు, ఎస్.ప్రసాద్, కె.రమేష్, ఎం.హనుమంతు, ఎన్.శ్రీనుపవన్, జి.సాంబయ్య, జాకీర్ రెహ్మాన్, అఫాసరి బేగ్, జి.అనిల్‌లను అభినందించి రివార్డులు అందించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రేమించిన అమ్మాయి తిరస్కరించడంతో మనస్తాపం చెందిన ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చెందాడు. రాజమహేంద్రవరం సంజీవ నగర్‌కు చెందిన కుసుమ ఎలీషా (22) అనే యువకుడు ఎడిబి రోడ్డు లోని చైతన్య పౌల్ట్రీలో పని చేస్తున్నాడు. ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించడంతో తన రూములో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

భార్య, భర్తలకు పదేళ్ల జైలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఇరుగుపొరుగు ఇళ్లకు మధ్య వచ్చిన వివాదంలో ఆదిన ప్రసాద్, ఆదిన లక్ష్మిలు తమ పక్కింటి మహిళ పాలాని మంగ(60)ను మెట్లుపై నుంచి తోసివేయటంతో ఆమె మృతి చెందింది. 2022 డిసెంబర్ ఒకటతో తేదీన జరిగిన ఈ సంఘటనపై అప్పటి ఎస్ఐ పి.శివకుమార్ కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో వాదోపవాదాల అనంతరం పెద్దాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప భార్యాభర్తలకు ఒక్కొక్కరికి పదేళ్లు జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసును మొదట అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.కామేశ్వరరావు, తర్వాత అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గన్నంరాజు వినయ తేజ వాదించారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

యూరియాకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయా అధికారి బి.రాజారావు రైతులకు సూచించారు. మండలంలోని చిలకపాడు, కాల్దారి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, యూరియాకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం గురించి వివరించారు. అధిక యూరియా వాడడం వల్ల కలిగే అనర్ధాలు, వివిధ ఎరువులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీల గురించి తెలిపారు, సమగ్ర భూ పోషక యాజమాన్య పద్ధతులైన నానో ఎరువులు, ముఖ్యంగా నానో యూరియా, నానో డిఎపి వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సొసైటీ అధ్యక్షులు, రైతులు, విఎఎలు స్వప్న, సాయి పాల్గొన్నారు.

నేడు సీతానగరం మండల సమావేశం

సీతానగరం : నేడు సీతానగరం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం పది గంటలకు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎంపిపి గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ సకాలంలో హాజరవ్వాలన్నారు.

'ఈ- క్రాప్ నమోదు వేగవంతం చేయాలి'

ప్రజాశక్తి - కాకినాడ

ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వ్యవసాయం, పౌరసరఫరాలు, సహకార, ఎపిఇపిడిసిఎల్, లీగల్ మెట్రాలజీ, రవాణా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ- క్రాప్ నమోదు, సిబ్బంది నియామకం, శిక్షణా కార్యక్రమాలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు, ఆర్ఎస్‌కెల వారీగా గోనెసంచుల నిల్వలు, హమాలీలు, రైస్ మిల్లులు తనిఖీలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణ ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు అధికారులు అవసరమైన ముందస్తు

అధికారులతో సమీక్షిస్తున్న జెసి రాహుల్ మీనా

చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఈ-క్రాప్ వివరాలు అత్యంత కీలకమన్నారు. జిల్లాలో ఈ- క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతులు పండించిన పంట రకం, సాగు విస్తీర్ణం వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది సక్రమంగా నమోదు చేసేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 60 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, మిగిలిన రైతుల వివరాలను ఈ- క్రాప్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ కేంద్రంలో పనిచేసే సిబ్బంది నియమకం, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణకు అనుగుణంగా అవసరమైన గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు రైస్ మిల్లులను అనుసంధానం చేసే ప్రక్రియ చేపట్టి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జిఎం దేవుల నాయక్, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్. సత్యనారాయణరాజు, డిసిఒ బి.శ్రీనివాసరెడ్డి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ జి.ప్రసాద్, వ్యవసాయ శాఖ ఎడిఎలు, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

ఆటో రంగ కార్మికుల సమస్యలపై ఈ నెల 18న నిర్వహిస్తున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నగర కమిటీ సమావేశం జి.రమణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన ఆటో రంగ కార్మికుల సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ఉన్న ఆటో డ్రైవర్ల అందరూ తరలి వెళ్లాలని కోరారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వల్ల ఆటో రంగ కార్మికుల జీవనోపాధి దెబ్బతిందని అన్నారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్లకు

చలో విజయవాడ కార్యక్రమంపై చర్చిస్తున్న నాయకులు

ఏడాదికి రూ.30 వేల సాయం అందించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పలివెల వీరబాబు, నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, అనపర్తి ఏడుకొండలు, బి సూర్యారావు, భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఎంసి కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక రైతు భవన్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొని మాట్లాడారు. పేరుకు పట్టణం అభివృద్ధి, గుర్తింపు పొందినా రైతాంగం మాత్రం అంతగా అభివృద్ధి చెందలేదన్నారు. కావున వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎంతో ప్రాధాన్యత ఉన్నదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులకు విలువైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం నూతన పాలకవర్గంతో ఎఎంసి మాజీ ఛైర్మన్ పాలకుర్తి శ్రీనివాసచార్యులచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. కమిటీ ఛైర్మన్‌గా అందుగుల మణికుమారి, వైస్ ఛైర్మన్‌గా సిద్దు వెంకటకృష్ణ భవనారాయణ, ఇతర డైరెక్టర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని టిడిపి జిల్లా

ఎంసి ఛైర్మన్ దంపతులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ

అధ్యక్షులు జ్యోతుల నవీన్, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, నియోజక వర్గ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, నిమ్మకాయల రంగనాగ్, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్‌మోహన్, బలుసు వాసు, నూనె రామారావు, పిట్టా జానకి రామారావు, సరోజ వాసు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు ఉంటుందని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల కమిటీ, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సేవా భావం కలిగి ఉండాలని, ప్రతిపక్ష పార్టీకి కౌంటర్ ఇచ్చే దిశగా కార్యకర్తలు ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడిగా ధూళిపూడి వెంకటరమణ(బాబి), ప్రధాన కార్యదర్శిగా కట్టా త్రిమూర్తులు, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంటపల్లి ఉమామహేశ్వరి, పితాని హేమలత, బిసి సెల్ మండల అధ్యక్షులుగా దంగేటి అన్వేష్, తెలుగు రైతు అధ్యక్షునిగా శ్రీకాళ సత్తిబాబు

నేతలను సత్కరిస్తున్న టిడిపి శ్రేణులు

ప్రమాణ స్వీకారం చేశారు. అతి త్వరలో మిగిలిన కార్యవర్గాన్ని, అనుబంధ సంఘాల కమిటీలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, వేగేశ్న భాస్కర రాజు, వాడ్రేవు వీరబాబు, మోపూరి వెంకటేశ్వరరావు, అల్లూరి రామకష్ణరాజు, గాదిరాజు సతీష్ , కొత్తూరు కాశీ ఈశ్వరుడు, ఉంగరాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు యానాంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్య శాఖ అధికారి టి.రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి యానాం ఆధ్వర్యంలో సావిత్రినగర్, గిరియంపేట, దరియాలతిప్ప, పరంపేట, మెట్టకూరు, కనకాల పేట గ్రామాల్లో ఉప ఆరోగ్య కేంద్రాల వద్ద ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కరప

మండలంలోని యండమూరులో నిర్మించే రోడ్డు పనులకు సర్పంచ్ మారెళ్ళ శివ, జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, బండారు మురళీ మంగళవారం శంకుస్థాపన చేశారు. జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యండమూరు నుంచి జి.బావరం వరకు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భోగిరెడ్డి గంగాధర్, యాళ్ల వీరవెంకటసత్యనారాయణ, సర్వశుద్ధి లోవ రాజు, మేడిశెట్టి పాండురంగా, సర్వసుద్ది ఏడుకొండలు పాల్గొన్నారు.

శ్మశానంలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కుమ్మరి వీధి శ్మశాన వాటికలో పెరిగిపోయిన తుప్పలపై స్థానికులు మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన మంగళవారం జెసిబితో పెరిగిపోయిన తుప్పలను తొలగించారు.

జిల్లాకు పిఠాపురం రాజా పేరు పెట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాకు పిఠాపురం రాజా పేరును పెట్టాలని కవి, చరిత్ర పరిశోధకులు, పిఠాపురం చరిత్ర రచయిత ర్యాలి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రదేశంలో సాంస్కృతిక సాహిత్య కళా రంగాలకు, సంఘ సంస్కరణకు, దళిత జనోద్ధరణకు ఆంధ్రభోజ పిఠాపురం మహారాజా రావు సూర్యారావు విశేషంగా కృషి చేశారన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక విద్యాసంస్థలు స్థాపించారన్నారు. తెలుగు భాషకు శాశ్వతమైన భాషా నిధిగా దశాబ్దాల కృషితో సూర్యరాయాంధ్ర నిఘంటువు నిర్మించారన్నారు. కాకినాడ పట్టణాన్ని నగరంగా తీర్చిదిద్దడంలో ఆయనది ప్రధానమైన పాత్ర అన్నారు. అటువంటి పిఠాపురం మహారాజా రావు సూర్యారావు బహుద్దూర్ వారి పేరుతో పిఠాపురం రాజా జిల్లా ఏర్పాటు చేయాలన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

జర్నలిస్టుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాకినాడ

గంజాయి మత్తులో కొందరు యువకుల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈనాడు విలేఖరి చంద్రశేఖర్ కుటుంబానికి ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(ఎపిడబ్ల్యూజెఎఫ్) నాయకులు ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్‌ను యూనియన్ నాయకులు పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు జి.శోభన్‌బాబు, మీడియా సెక్రెటరీ పుర్రె త్రినాధ్, జిల్లా నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ చంద్రశేఖర్‌పై దాడి అత్యంత హేయమైన చర్య అని అన్నారు. జర్నలిస్టులకే రక్షణ లేకపోతే మిగిలిన సామాన్యుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. తక్షణమే పోలీసులు దాడికి గల కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు పునరావృతమయితే ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

సైన్స్ సెంటర్‌లో కృష్ణా జిల్లా బృందం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌ను కృష్ణా జిల్లా కాటూరుకు చెందిన జడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయ బృందం స్వాతంత్ర్య సమరయోధుడు అన్నే సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్లో ఉన్న ప్రయోగశాలలు, ప్రయోగ సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై ఇస్తున్న శిక్షణను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సైన్స్ సెంటర్‌ను స్ఫూర్తిగా తీసుకుని తమ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సెంటర్ ఇన్‌ఛార్జ్ బుద్ధా శ్రీనివాస్, ఉపాధ్యాయులు భానుప్రకాష్, లంకేశ్వర్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ పాలకవర్గానికి సన్మానం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి మత్స్యకార సొసైటీ పాలకవర్గాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సత్కరించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నూతనంగా సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికైన బత్తుల వెంకటేశ్వర్లు, ఇతర 9 మంది సభ్యులు నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను ఆయన సత్కరించారు.

అధికారుల్లో కొరవడిన సమన్వయం

ప్రజాశక్తి - జగ్గంపేట

అధికారుల్లో సమన్వయం లోపించి ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఎంపిపి అత్తులూరి నాగబాబు ఆరోపించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు గైర్హాజరు అయ్యారు. ఈ సందర్భంగా తాగునీరు, పైపులైన్ పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వివరిస్తుండగా జలజీవన్ మిషన్ ద్వారా చేసిన పనులతో రోడ్లు ధ్వంసం అయ్యాయని, వాటిని అలానే ఎందుకు వదిలేశారని ఎంపిపి ప్రశ్నించారు. కాంట్రాక్టర్ వదిలేయడంతో అలా ఉండిపోయా

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నాగబాబు

యని ఎఇ సమాధానం ఇచ్చారు. ఉన్నతాధికారులకు తెలియజేసి బిల్లులు నిలుపుదల చేయించాలి కదా అని ఎంపిపి మండిపడ్డారు. వ్యవసాయ శాఖ అధికారి పని తీరుపై రామవరం ఎంపిటిసి దొడ్డ శ్రీను ఎరువులు ఎక్కడ అందుబాటులో ఉన్నాయో చెప్పాలని నిలదీశారు. ఎరువులు కోసం వెళితే పురుగుల మందులు తీసుకోవాలనే నిబంధన పెడుతున్నారన్నారు. డ్వాక్రా రుణాల మంజూరులో రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారంటూ ఎపిఒపై ఎంపిటిసిలు మండిపడ్డారు. ఈ సమావేశానికి తొమ్మిది మంది ఎంపిటిసిలు మాత్రమే హాజరుకావడం విశేషం. ఇదేరీతిలో సర్పంచులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి ఒమ్మి బిందుమాధవి, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఇఒపిఆర్‌డి ఎవివి.సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటెన్సిఫైడ్ ఐఇసిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక గైగోలుపాడు జడ్‌పిహెచ్ స్కూల్‌లో ఇంటెన్సిఫైడ్ ఐఇసిపై అవగాహన సదస్సు మంగళవారం ప్రారంభం అయింది. జనసేన నాయకులు పంపన ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభం అయిన ఈ కార్యక్రమం అక్టోబర్ 30 వరకు జరగనుంది. లైంగిక ఆరోగ్యం పట్ల అవగాహన, నిగ్రహ శక్తి ఏ విధంగా పెంపొందించుకోవాలనే అంశాలపై ప్రాజెక్ట్ మేనేజర్ దుర్గాభవాని వివరించారు. ఇప్పటివరకు 13 సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎం.రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు జనసేన నాయకులు పంపన మహేష్, చేంజెస్ ప్రాజెక్ట్ మేనేజర్ దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాల వృద్ధి కోసమే పి4 పథకం

ప్రజాశక్తి - సామర్లకోట

పేద కుటుంబాల వృద్ధి కోసమే పి.4 పథకాన్ని ప్రభుత్వం రూపొందించిందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం హుస్సేన్‌పురం గ్రామంలో పి.4 పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌డిఒ శ్రీరమణి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. కుటుంబాల్లో అసమానతలను తొలగించేందుకు సిఎం చంద్రబాబు ముందు చూపుతో పి.4 పథకాన్ని అమలులోకి తెచ్చారన్నారు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు వారి స్థాయిని బట్టి పేదరికంలో ఉన్న కుటుంబాలకు చేయూతనిచ్చేలా ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు కొన్ని పేద

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలోని 8 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి తాను దత్తత తీసుకుంటున్నట్టు ఎంఎల్ఎ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులచౌదరి, గుమ్మళ్ళ రామకృష్ణ, రాజా సూరిబాబురాజు, చల్లా బుజ్జి, అత్తిలి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐస్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని తాళ్లరేవు శివారు రెడ్డివారి పాలెంలోని గమిని ఐస్ ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి గ్యాస్ లీక్ అవ్వడం తో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐస్ తయారీలో వినియోగించే అమోనియా గ్యాస్ పైపు పగిలిపోవడంతో గ్యాస్ లీకై బయటికి వ్యాపించింది. దీంతో ఫ్యాక్టరీ ఆనుకుని ఉన్న గ్రామస్తులంతా కళ్ళు మండటం, కళ్లుతిరగడం వంటి సమస్యలను ఎదుర్కొన్నారు. తరచూ ఇలా గ్యాస్ లీకవడం జరుగుతుందని, దాని వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలానికి కోరంగి పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకుని వివరాలు సేకరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

లక్ష్యసాధనకు నిజాయతీగా కృషి

ప్రజాశక్తి - రాజానగరం

లక్ష్య సాధనకు నిజాయతీగా కృషి చేయాలని విసి ఎస్.ప్రసన్నశ్రీ విద్యార్థులకు సూచించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు "దీక్షారాంభ్" ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను మంగళవారం నిర్వహించారు. దీనికి విసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయ జీవితం విద్యార్థులకు స్వేచ్ఛను అందిస్తుందన్నారు. బాధ్యతతో కూడిన స్వేచ్ఛ మెరుగైన జీవితాన్ని ఇస్తుందన్నారు. నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ విద్యకు మూడు ప్రాథమిక సూత్రలు అవలంబించాలని సూచించారు. అభ్యాసానికి మొదటి ప్రాధాన్యత నివ్వాలని, తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, ప్రయోగశాలలు, లైబ్రరీ వంటి వాటిలో ఎక్కువ సమయం గడపాలన్నారు. విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, ఇంటర్న్‌షిప్‌లు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సాంస్కతిక కార్యక్రమాలు, క్రీడలు, ఎన్ఎస్ఎస్ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

అయినవిల్లి మండలం, మాగం గ్రామం, వి ఆర్ కాలనీకి చెందిన **నక్కా సుధారాణి,** C/o. నక్కా నరసింహామూర్తి కి చెందిన **Y3884419** నెంబరు గల పాస్‌పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 18 సెప్టెంబరు 2025న మాగం, వి ఆర్ కాలనీ లో మా ఇంటి నుండి అనాతవరం వెళ్తూ ఉండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్: నక్కా సుధారాణి
C/o. నక్కా నరసింహామూర్తి, మాగం,
వి.ఆర్.కాలనీ, అయినవిల్లి మండలం- 533577
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్: 9010021164

రైతుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సొసైటీల ద్వారా రైతుల అభివృద్ధికి త్రీ మెన్ కమిటీ కృషి చేయాలని ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. మంగళవారం కోరంగి సొసైటీ త్రీ మెన్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షులుగా కొప్పిశెట్టి శ్రీనాగ వీరభద్రేశ్వరరావు, సభ్యులుగా వాసంశెట్టి గోవిందు, ఏసూరి సత్తి రాంబాబు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

విద్యార్థులకు ఫైలేరియా స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి పిహెచ్‌సి సిబ్బంది విద్యార్థులకు ఫైలేరియా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. సోమవారం స్థానిక ఎంపిపి పాఠశాల, శ్రీ ప్రజ్ఞ, మండలంలోని జె.కొత్తూరులోని హ్యాపీ చిల్డ్రన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లోని విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎన్.పూజ, ఎం.మురళీ మాట్లాడుతూ ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వే -2 బృందం ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ ఉమామహేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ శంకర్, పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కూటమి సర్కారు కృషి

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామాల అభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మండలంలో ఆయన మంగళవారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నియమించిన అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పడమటి శ్రీనివాస్, పోసిన గణపతి శ్రీనివాస్, పెనుగొండ శ్రీనివాస్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ప్రజలకు మరింత నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలన్నారు. దీని కోసం డైరెక్టర్లు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని తొక్కిరెడ్డిగూడెంలో 22 మంది లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. గుడ్డిగూడెంలో రూ.25 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఎస్‌సి కాలనీలో రూ.70లక్షలతో నిర్మించే సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నూతన సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, గంధ్రోతు శ్రీనివాసరావు, సత్తనపల్లి శీను, గుడ్డిగూడెం సర్పంచ్ మడిచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

యూరియా గొడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

ములకల్లంక ప్యాక్స్‌లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్టాకు, రికార్డులను పరిశీలించారు. రికార్డులు, నిల్వలు అన్నీ సక్రమంగా ఉన్నట్లు వారు గుర్తించారు. రైతులందరికీ యూరియా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

కాకినాడ 4వ జిల్లా జడ్జి గారి కోర్టులో
G.O.P. 74/2025

Between:
1.శ్రీమతి అయలూరి మోహిని పార్వతి
2. అయలూరి కార్తికేయ ఈశ్వర జగన్నాద్
(మైనర్ రిప్రజెంటెడ్ బై మదర్ శ్రీమతి అయలూరి మోహిని పార్వతి) ...పిటీషనర్లు
మరియు
నిల్ ...రెస్పాండెంట్
టు :
ది జనరల్ పబ్లిక్

పైన తెలిపిన పిటీషనర్లు ఉభయులు పై నెంబరుగల పిటీషన్ G.O.P.74/2025 ను పై కోర్టువారి ముందు దాఖలు చేసి, షెడ్యూలు ఆస్తిలో మైనరైన 2వ పిటీషనరు యొక్క అనిర్దిష్ట వాటాను క్రియ పర్చుటకు అనుమతిని ఇవ్వవలసినదిగా కోరివున్నారు. ఈ పిటీషన్ పై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు వున్నను, వారు తమ అభ్యంతరములను **ది. 07-10-2025** వ తారీకు **ఉదయం 10 గంటలకు** పై కోర్టు వారి ముందు హాజరై తెలుపుకొనవచ్చును. లేనిచో అభ్యంతరములు లేనివిగా పరిగణించి కోర్టు వారు ఈ పిటీషన్ పై తగు తీర్పును ఇవ్వగలరు. కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన జారి చేయడమైనది.

యస్.కె. మొహిద్దీన్
యస్. ఏజాజుద్దీన్, యస్.హజరత్ అలి,
అడ్వకేట్స్‌డో.నెం. 20-4-27,
మొహిద్దీన్ స్ట్రీట్, కాకినాడ.
కాకినాడ.
ది. 16-09-2025 సెల్: 9440109900

మహారాజశ్రీ అమలాపురం గౌరవ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 47/2018
O.S. No. 401/2013

Between:
D.Hr: తేతలి రాధాకృష్ణ రెడ్డి
AND
J.Dr: చిట్టూరి సునీత

ఈ నెంబర్ డిక్రీ బాకీకి గాను ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై కోర్టు వారి ఎదుట ది. 06-10-2025వ తేదీన ఉదయం 10.30 గం॥ లగాయతు వేలం కాబడును. కావలసినవారు వచ్చి యిస్తిహాజరు షరతులకు లోబడి పాడుకోవచ్చును.

షెడ్యూలు: (తూ॥గో॥జిల్లా) డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సబ్ రి., అమలాపురం మున్సిపాలిటీ నారాయణపేట J.Dr తాలూకు వేలం కావలసిన సొత్తు యొక్క షెడ్యూలు అమలాపురం మున్సిపాలిటీ నారాయణపేట, ఆర్.ఎస్. నెం. 430/2 లో పడమర వైపు 125 గజాలు = 104.5 Sq.mts లో 165 గజములలో 0.84 సెంట్లు పూరా హద్దులు.

తూర్పు: 'A' షేర్ ఇన్ ది సైట్ అండ్ లెట్రిన్స్ బాత్‌రూమ్స్. **దక్షిణం:** కాంపౌండ్ వాల్ ఆఫ్ కడిమెళ్ళ రవి. **పడమర:** మున్సిపాలిటీ సిమెంటు రోడ్. **ఉత్తరం:** కుడిపూడి సుబ్బారావు ఇల్లు.

సదరు హద్దుల మధ్య స్థలమైన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిలో డోర్ నెంబర్ 3-3-23/15 నిర్మించిన డాబా ఇంటితో సహా కిటికీలు, ద్వారబంధాలు, పై కప్పు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ మరియు దారి మార్గాలు, నీటి వనరులు సమస్తం ఈజిమెంట్ హక్కులతో సహా.

D.Hr. Value: Rs. 11,00,000/-
Amin Value: Rs. 16,00,000/-

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
డి.వి.వి.ఎస్.మూర్తి (బాబీ)
అమలాపురం అడ్వకేట్, అమలాపురం
ది.14-09-2025 సెల్: 9848344577